చిన్న రాష్ట్రాలతో సమస్యలు తీరేనా..!

దేశంలో కొత్త రాష్ట్రాలు ఏర్పాటుచేసి దాదాపు ఎనిమిదేళ్లు కావస్తోంది. ఎన్డీయే హయాంలో.. 2000, నవంబరులో మూడు పెద్ద రాష్ట్రాలైన మధ్యప్రదేశ్, ఉత్తరప్రదేశ్, బీహార్‌ల నుంచి కొత్తగా ఛత్తీస్‌గఢ్, ఉత్తరాఖండ్, జార్ఖండ్ ఏర్పాటు చేశారు. దాంతో భారత్‌లో రాష్ట్రాల సంఖ్య 28కి పెరిగింది. అయినా, దేశంలోని పలు ప్రాంతాల్లో కొత్త రాష్ట్రాలు కావాలన్న డిమాండ్‌లు ఇంకా వస్తూనే ఉన్నాయి!

మహారాష్ట్రలోని విదర్భ, ఆంధ్రప్రదేశ్‌లోని తెలంగాణను ప్రత్యేక రాష్ట్రాలుగా ప్రకటించాలని కోరుతూ.. ఐదు దశాబ్దాల క్రితమే ఉద్యమాలు ప్రారంభమయ్యాయి. జనాభారీత్యా అతిపెద్ద రాష్ట్రమైన ఉత్తర ప్రదేశ్‌ను హరితప్రదేశ్, బుందేల్‌ఖండ్ (మధ్యప్రదేశ్‌లోని కొన్ని జిల్లాలతో కలిపి), పూర్వాంచల్ అనే మూడు రాష్ట్రాలుగా ఏర్పాటు చేయడానికి కేంద్ర ప్రభుత్వం అంగీకరిసే అసెంబ్లీలో తీర్మానం చేయించ డానికి సిద్ధమేనని ఉత్తరప్రదేశ్ ముఖ్యమంత్రి మాయావతి ప్రకటించారు. మరోవైపు పశ్చిమబెంగాల్‌లోని ఉత్తరప్రాంత జిల్లాలైన డార్జిలింగ్, సిలిగురి, జల్పాయిగురితో.. నేపాలీ భాష మాట్లాడే గూర్ఖాలు నివసించే ప్రాంతాలను కలిపి, గూర్ఖాలాండ్ రాష్ట్రం ఏర్పాటు చేయాలనే డిమాండ్ 50 ఏళ్లుగా ఉంది. గూర్ఖాలు ఇటీవల తమ డిమాండ్ సాధించడానికి హింసామార్గం పట్టారు. హరితప్రదేశ్ కోసం పశ్చిమ యూపీలో, బుందేల్‌ఖండ్ ఏర్పాటుకు యూపీ, ఎంపీల్లో ప్రత్యేకంగా ఎలాంటి ఉద్యమాలు సాగకున్నా... అప్పుడ ప్పుడూ పత్రికా ప్రకటనలు మాత్రం కనిపిస్తున్నాయి.

దక్షిణాదిలో ఆంధ్రప్రదేశ్‌లోనే:

దక్షిణాదిలో ఒక్క ఆంధ్రప్రదేశ్‌లోనే ప్రత్యేక రాష్ట్రం కోసం 1969-71 మధ్య ఉద్యమం ఉధృతంగా సాగింది. ప్రత్యేక తెలంగాణ నినాదంతో 1971 లోక్‌సభ ఎన్నికల్లో మర్రి చెన్నారెడ్డి నాయకత్వంలో పోటీచేసిన తెలంగాణ ప్రజాసమితి (టీజేఎస్) ఈ ప్రాంతంలోని మొత్తం 14 స్థానాల్లో పది సీట్లు గెలుచుకుంది. అదే ఏడాది సెప్టెంబరులో ప్రధాని ఇందిరాగాంధీ హామీ మేరకు టీజేఎస్ 'ప్రత్యేక' డిమాండ్‌ను వదులుకొని, కాంగ్రెస్‌లో విలీనమైంది. ఫలితంగా మళ్లీ 30 ఏళ్ల వరకూ, అంటే.. 2001 నాటి వరకూ తెలంగాణ కావాలనే డిమాండ్ పెద్దగా వినిపించలేదు. ఏడేళ్ల క్రితం తెలుగుదేశం అధికారంలో ఉండగా డిప్యూటీ స్పీకర్ పదవికి రాజీనామాచేసిన కల్వకుంట్ల చంద్రశేఖరరావు(కేసీఆర్)..తెలంగాణరాష్ట్ర సమితి(టీఆర్ఎస్)ని స్థాపించారు.

తెలంగాణ కోసం:

టీఆర్ఎస్.. ఆవిర్భవించిన కొద్ది నెలలకే జరిగిన పంచాయతీ ఎన్నికల్లో చెప్పుకోదగ్గ సంఖ్యలో సీట్లు సాధించి, సంచలనం సృష్టించింది. ఆ తర్వాత 2004 లోక్‌సభ, అసెంబ్లీ ఎన్నికల్లో కాంగ్రెస్‌తో పొత్తు

పెట్టుకుని పోటీ చేసింది. మొదట కేంద్రంలోని యూపీఏ ప్రభుత్వంలో.. తర్వాత రాష్ట్ర కేబినెట్‌లో మంత్రి పదవులు చేపట్టిన టీఆర్ఎస్.. తన లక్ష్య సాధనకు ఎన్నికలనే ప్రధాన ఆయుధంగా ఎంచుకుంది. అందుకే గతంలో టీజేఎస్ మాదిరిగా ఆందోళన పథంలో పయనించలేదు. ఏడాది తర్వాత రాష్ట్రంలో వైఎస్ మంత్రివర్గం నుంచి, మరికొంత కాలానికి కేంద్ర కేబినెట్ నుంచీ వైదొలగింది. తన ఎంపీలు, ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీలతో రాజీనామా చేయించి, గత నెలాఖరులో 16 అసెంబ్లీ, నాలుగు లోక్‌సభ స్థానాలకు ఉప ఎన్నికలకు కారణమైంది. ఎన్నికల ఫలితాలు టీఆర్ఎస్‌కు అనుకూలంగా రాలేదు. హింసాత్మక ఆందోళనలకు తాము వ్యతిరేకమని టీఆర్ఎస్ మొదటి నుంచీ ప్రకటిస్తూ వస్తోంది. కేంద్రంలో ఏక పార్టీ పాలనకు కాలం చెల్లి పుష్కరకాలం గడచింది. రెండు ప్రధాన పార్టీల్లో (కాంగ్రెస్, భాజపా) ఏ ఒక్కటీ లోక్‌సభలో సొంతంగా మెజారిటీ సీట్లు గెలిచే రోజులు పోయాయి. తెలంగాణ సాధనకు.. మారిన ఈ రాజకీయ పరిస్థితులు అనుకూలమనీ... ఈ ప్రాంతంలో తాము 15 స్థానాలు సాధించి, కేంద్రంలో ప్రభుత్వం ఏర్పాటు చేసే కూటమికి మద్దతు పలికితే... తెలంగాణ తేలికగా వస్తుందని కేసీఆర్ పదేపదే చెబుతున్నారు. ఎప్పటికప్పుడు ఎన్నికలకు, ఉప ఎన్నికలకు సిద్ధం కావడమే ఉద్యమంగా ఈ పార్టీ భావిస్తోంది. ఇక తమిళనాడు, కర్ణాటక, కేరళలో ప్రత్యేక రాష్ట్రం కావాలని ఏ ప్రాంతంలోనూ డిమాండ్లు లేవు. యూపీఏ సర్కారులో భాగస్వామిగా ఉన్న తమిళ పార్టీ పీఎంకే.. వన్నియార్లు పెద్ద సంఖ్యలో నివసించే ఉత్తర తమిళనాడును ప్రత్యేక రాష్ట్రంగా చేయాలని మొదట్లో డిమాండ్ చేసింది. ప్రత్యేక రాష్ట్రం వస్తే తప్ప వన్నియార్లకు అధికారం రాదని చెప్పింది. అయితే ఇప్పుడా ఊసెత్తడం లేదు.

చిన్న రాష్ట్రాలు.. ప్రగతి:

చిన్న రాష్ట్రాలు ఏర్పాటు చేస్తే అన్ని ప్రాంతాలూ అభివృద్ధి చెందుతాయనే వాదన ఎప్పటి నుంచో ఉంది. చిన్న రాష్ట్రాలతో అధికార వికేంద్రీకరణ జరుగుతుందనీ.. వెనుకబడిన ప్రాంతాలపై దృష్టి పెట్టవచ్చని చెప్పేవారూ ఉన్నారు. విశాల పంజాబ్‌ను మూడు ముక్కలు చేశాక.. ఆవిర్భవించిన చిన్న రాష్ట్రాలు పంజాబ్, హర్యానా, హిమాచల్‌ప్రదేశ్ శరవేగంతో ప్రగతి సాధించాయని వారు చెబుతున్నారు. ఈ మూడూ కేవలం చిన్న రాష్ట్రాలు కావడం వల్లే అభివృద్ధి చెందాయనడం సరికాదు. వీటి ప్రగతికి ఇతర కారణాలూ అనేకం ఉన్నాయి. ఉత్తరాఖండ్, జార్ఖండ్, ఛత్తీస్‌గఢ్‌లు సైతం ఈ ఎనిమిదేళ్లలో చెప్పుకోదగ్గ అభివృద్ధి సాధించాయని చిన్న రాష్ట్రాల అనుకూలురు అంటున్నారు. పెద్ద రాష్ట్రాల నుంచి విడిపోయాక జార్ఖండ్, ఛత్తీస్‌గఢ్‌లలో మావోయిస్టులు విజృంభించారనే వాదన ఉంది. అయితే, ఇక్కడ నక్సలిజానికి అనుకూల పరిస్థితులు ఎప్పటి నుంచో ఉన్నాయి. పెద్ద రాష్ట్రాల్లో అంతర్భాగంగా ఉన్నప్పుడు పాలకుల నిర్లక్ష్యమే వామపక్ష తీవ్రవాదం పుట్టుకకు కారణమైంది.

కేంద్రం నిర్ణయమే కీలకం:

ఈశాన్య ప్రాంతంలో పలు చిన్న రాష్ట్రాలు ఏర్పాటైనా... ప్రగతి సాధించినవి కొన్నే. స్వాతంత్ర్యం వచ్చిన

కొత్తలో భాషాప్రయుక్త రాష్ట్రాల ఏర్పాటుకు ప్రాధాన్యం ఇచ్చేవారు. నిజానికి బ్రిటిషర్ల హయాంలో 1922లోనే కాంగ్రెస్ పార్టీ భాషాప్రయుక్త రాష్ట్రాలకు అనుకూలత వ్యక్తం చేసింది. 1960ల తర్వాత పరిపాలనా సౌలభ్యం కోసం ఒకే భాష మాట్లాడే ప్రజలున్న ప్రాంతాలను రెండు మూడు రాష్ట్రాలుగా విభజించడం తప్పుకాదనే వాదన ముందుకొచ్చింది. మొత్తం మీద జనం గట్టిగా కోరితే.. ప్రత్యేక లేదా చిన్న రాష్ట్రాలను ఏర్పాటు చేయడం ప్రజాస్వామ్య స్ఫూర్తికి అనుకూలమనే వాదనతో అందరూ అంగీకరిస్తారు. జనాభిప్రాయం తెలుసుకొని.. తగిన సమయంలో నిర్ణయం తీసుకోవలసింది పార్లమెంటే. అంటే... లోక్‌సభలో ఉన్న మెజారిటీ ఆధారంగా కేంద్రంలో అధికారం చెలాయించే కూటమి తగిన సమయంలో తగు నిర్ణయం తీసుకోవాల్సి ఉంటుంది!!